సాక్షి జగిత్యాల

గురువారం । 29 । మే । 2025



రుణ ప్రణాళిక ఖరారు

వానాకాలం సీజన్ పంటల రుణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. గతేడాదితో పోల్చితే రూ.166 కోట్లు అదనంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. -8లో▸



సహకార సంఘాల్లో బదిలీలు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న అధికారులకు బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. వీరంతా ఏళ్ల తరబడిగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారు. -8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. మరికొన్నిచోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

జగిత్యాల: నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కొడిమ్యాల మండలకేంద్రంలోని అక్షయ గార్డెన్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పంపిణీ చేశారు. మండలంలో 437 ఇళ్లు మంజూరు కాగా.. 436 మందికి మంజూరు పత్రాలను అందించామన్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, హౌసింగ్ ప్రత్యేక అధికారి, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పకడ్బందీగా అమలు

రాజీవ్ యువ వికాసం పథకం పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. యూనిట్ల గ్రౌండింగ్‌కు సంబంధించి డెప్యూటీ సీఎం విక్రమార్క కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లా సమాచారాన్ని కలెక్టర్ ఆయనకు వివరించారు.

గ్రామీణుల కోసమే పల్లె దవాఖానాలు



తిమ్మాపూర్‌లో పల్లె దవఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం: గ్రామీణులకు వైద్య సేవలు అందించేందుకే పల్లె దవాఖానాలు ప్రారంభిస్తున్నట్లు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్, వర్షకొండ గ్రామాల్లో దవాఖానాల ఏర్పాటుకు జాతీయ వైద్య ఆరోగ్య శాఖ నిధులు రూ.20లక్షల చొప్పున మంజురయ్యాయన్నారు. పట్టణాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదల కోసం కేసీఆర్ ప్రభుత్వంలో పల్లె దవాఖానాలను నిర్మించిందని గుర్తు చేశారు. ఇందులో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారని, మందులు ఉచితంగా ఇస్తారని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. తాను ఎంబీబీఎస్ చదివినప్పుడు కేవలం రెండు మెడికల్ కాలేజీలే ఉండేవని, కేసీఆర్ సీఎం అయ్యాక జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటైందన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యాధికారి అనిల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ అభినవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, మాజీ వైస్ ఎంపీపీ నోములల లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అవ్వా నిన్ను ఆదుకుంటా

'అవ్వా.. నిన్ను ఆదుకుంటా.. ఏద్వకు, వృద్ధాశ్రమానికి పంపిస్తా..' అని ఎమ్మెల్యే ఓ వృద్ధురాలిని ఓదార్చారు. తిమ్మాపూర్‌లో పల్లె దవఖానా ప్రారంభించి వస్తుండగా రోడ్డు పక్కన చిన్న గుడిసెలో ఉంటున్న అనాథ వృద్ధురాలు చిన్నంశెట్టి లచ్చవ్వ వద్దకు వెళ్లారు. ఆమెను ఏదైనా ఆశ్రమంలో చేర్పించాలని కొందరు మహిళలు ఆయనకు వివరించడంతో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేష్‌కు ఫోన్ చేసి వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించాలని సూచించారు.

రోళ్లవాగు పనులు ప్రారంభం



గోడ నిర్మాణ పనులు చేపడుతున్న కూలీలు

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. కట్టపై 1275 మీటర్ల పొడవుతో గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. బీర్‌పూర్ శివారులో రూ.136.81 కోట్లతో 2015 – 16లో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు 85 శాతం పూర్తయ్యాయి. నిధుల లేమితో ఏడాదికాలంగా పనులు ముందుకు సాగలేదు. మరోవైపు అటవీశాఖ అనుమతులు కూడా ఆలస్యం కావడంతో ప్రాజెక్టు వ్యయం పెరిగింది. ఇటీవల ప్రభుత్వం రూ.17 కోట్లు కేటాయించడంతో పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు పూర్తయితే బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇంకా మూడు స్లూయిస్‌కు గేట్లు బిగించాల్సి ఉంది. జూన్‌లో గేట్లు బిగించనున్నట్లు డీఈ చక్రునాయక్ తెలిపారు.

పెరిగిన జననాలు.. తగ్గిన మరణాలు

- పెద్దపల్లి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న శిశు మరణాలు
- జీరో శాతంతో కరీంనగర్ జిల్లా బెస్ట్
- రాజన్న సిరిసిల్లలో దాదాపు సమానం
- జగిత్యాలలో భారీగా తగ్గిన జననాలు
- సీఆర్ఎస్ – 2021 నివేదికలో వెల్లడి



సాక్షి,పెద్దపల్లి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జననాలు పెరిగాయి. అదే సమయంలో మరణాలు చాలావరకు తగ్గిపోయాయి. పెద్దపల్లి జిల్లాలో శిశు మరణాలు అధికంగా చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. కరీంనగర్ జిల్లా జీరో మరణాలు నమోదు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జననాలు.. మరణాలు దాదాపు సమానంగా ఉండగా.. జగిత్యాల జిల్లాలో మాత్రం జననాల రేటు భారీగా తగ్గిపోయిందని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సీఆర్ఎస్)–2021 ఆధారంగా విటల్ స్టాటిస్టిక్స్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది.

నివేదిక ప్రకారం

జనన, మరణాలను అధికారికంగా నమోదు చేసే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం – 2021 ఆధారంగా విటల్ స్టాటిస్టిక్స్ ఆఫ్ ఇండియా ఇటీవల నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం ఏడాది వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో జననాలు 43,345 ఉండగా.. మరణాలు 26,757 నమోదయ్యాయి. శిశు, గర్భస్థ మరణాలు పెద్దపల్లి జిల్లాలో ఆందోళనకరంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 25,384 మంది మగపిల్లలు జన్మించగా.. 22,989 మంది అమ్మాయిలు పుట్టారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆడపిల్లల కన్నా మగపిల్లల జననాలే ఎక్కువగా ఉన్నాయి. ఇందులోనూ గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లోనే అధికంగా నమోదయ్యాయి.

2021 నివేదిక ఆధారంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జననాలు

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		మొత్తం
	మగ	ఆడ	మగ	ఆడ	మగ	ఆడ	
కరీంనగర్	472	394	11,254	9,669	11,726	10,063	21,789
పెద్దపల్లి	156	133	4,678	4,405	4,834	4,538	9,372
జగిత్యాల	8	11	6,126	6,039	6,134	6,050	12,184
సిరిసిల్ల	198	171	2,492	2,167	2,690	2,338	5,028

పెద్దపల్లిలో ఆందోళనకరం

ఏడాది లోపు వయస్సు ఉన్న శిశువు మరణిస్తే దానిని శిశుమరణ రేటుగా పిలుస్తారు. కరీంనగర్‌లో జీరో శిశుమరణాలతో సంతృప్తికరంగా ఉండగా.. పెద్దపల్లిలో తీవ్ర ఆందోళనకరంగా ఉన్నాయి.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శిశుమరణాలు ఇలా

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		మొత్తం
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	
కరీంనగర్	0	0	0	0	0	0	0
పెద్దపల్లి	18	6	786	768	804	774	1,578
జగిత్యాల	0	0	166	0	166	0	166
సిరిసిల్ల	27	20	1	2	28	22	50




స్టిల్ బర్త్ మరణాల్లోనూ

స్టిల్‌బర్త్ అంటే గర్భంలో ఉన్న శిశువు గర్భధారణ జరిగిన 20 వారాల తర్వాత.. లేదా పుట్టిన సమయంలోనే మరణించడం. ఇది జననానికి ముందు లేదా.. జనన సమయంలో సంభవించవచ్చు. స్టిల్ బర్త్‌కు కారణాలు గర్భధారణ, తల్లి ఆరోగ్య పరిస్థితులు (డయాబెటిస్, అధిక రక్తపోటు, థైరాయిడ్), ప్లాసెంటా, జన్యు అసాధారణ సమస్యలతో గర్భంలో శిశువు పెరుగుదల లోపించి మరణానికి దారితీస్తుంది. గర్భధారణ సమయంలో చెకప్‌లు, ఆరోగ్యకరమైన జీవనశైలి, తల్లి ఆరోగ్య సంరక్షణతో వీటికి అడ్డుకట్ట వేయవచ్చని నివేదికలో పేర్కొంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గర్భస్రావాలు (స్టిల్‌బర్త్) ఇలా..

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		మొత్తం
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	
కరీంనగర్	0	0	0	0	0	0	0
పెద్దపల్లి	11	5	39	27	50	32	82
జగిత్యాల	0	0	0	0	0	0	0
సిరిసిల్ల	12	10	1	0	13	10	23



మరణాల్లో పురుషులే అధికం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మరణాలు తక్కువగానే నమోదు అవుతున్నాయి. అతి తక్కువ మరణాలు కరీంనగర్‌లో నమోదవుతుండగా.. రాజన్నసిరిసిల్లలో జననాలు 5,028, మరణాలు 5,130 దాదాపు సమానంగా ఉన్నాయి. మొత్తంగా 16,359 మంది మగవారు చనిపోతే.. 10,398 మంది ఆడవారు మరణించారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మరణాలు ఇలా

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		మొత్తం
	మగ	ఆడ	మగ	ఆడ	మగ	ఆడ	
కరీంనగర్	818	696	4,535	2,442	5,353	3,138	8,491
పెద్దపల్లి	2,400	1,688	1,584	894	3,984	2,582	6,566
జగిత్యాల	1,996	1,517	1,999	1,058	3,995	2,575	6,570
సిరిసిల్ల	2,376	1,668	651	435	3,027	2,103	5,130

డీఈవో వ్యాఖ్యలు..ఆరని మంటలు!

- మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కరీంనగర్‌వాసి
- చర్యలు తీసుకోవాలని మరిన్ని ఫిర్యాదులు
- క్రమంగా వెలుగులోకి జనార్దన్‌రావు వ్యవహారాలు
- ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్లుగా కరీంనగర్‌లో విధులు
- కలెక్టరు కార్యాలయం తీరుపైనా విమర్శలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు వ్యవహారం మరింత ముదిరింది. ‘భర్తలకు వంట రాకపోతే.. భార్యలు లేచిపోతారు.. తాను రెండు సంసారాలు ఈదుతున్నాను’ అంటూ తలతిక్క వ్యాఖ్యలతో శిక్షణ శిబిరాల్లో టీచర్లను బెంబేలెత్తించిన డీఈవో జనార్దన్‌రావుపై విమర్శలు, ఆరోపణలు ఆగడం లేదు. ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ.. కలెక్టర్ పమేల సత్పతి మంగళవారం రాత్రి ఆదేశాలిచ్చినా.. టీచర్లు శాంతించడం లేదు. ఆయన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని కించపరిచేలా ఉన్నాయని పలువురు తోటి ఉద్యోగులు మండిపడుతుండగా.. సామాజిక ఉద్యమకారుడు షాబుద్దీన్ డీఈవోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మహిళా కమిషన్‌కు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేశారు. డెమొక్రాటిక్ టీచర్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నాయకులు జనార్దన్‌రావుపై హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) కూడా అతనిపై చర్యలకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం కూడా సోషల్ మీడియాలో, మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో విషయం ప్రాధాన్యం సంతరించుకోవడంతో ఇదే వ్యవహారంపై చర్చ నడుస్తోంది. డీఈవో జనార్దన్ సిరిసిల్లకు కూడా డీఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో కామారెడ్డి డీఈవో ఎస్.రాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు కరీంనగర్ డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య నూతన డీఈవోగా బుధవారం అదనపు బాధ్యతలు చేపట్టారు.

దండిగా పెద్దల దన్ను..

జనార్దన్‌రావుకు ప్రభుత్వ పెద్దల నుంచి దండిగా సహకారాలు ఉన్నాయని సమాచారం. కరోనా నుంచి డీఈవోగా కొనసాగుతున్న ఈయనపై ఎన్ని విమర్శలు వచ్చినా చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

➡ జిల్లాలో టీచర్లకు అకారణంగా, అత్యధికంగా మెమోలు ఇచ్చిన డీఈవో అన్న ఆరోపణలు ఉన్నాయి. యూనియన్ నాయకులకు ఇంక్రిమెంట్లలో కోత విధించారన్న విమర్శలు తెలిసిందే.

➡ వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో పనిచేసిన ప్రతీ ఉన్నతాధికారి ఎన్నికల నియమావళి ప్రకారం.. బదిలీపై వెళ్లారు. కానీ, ఈయనను కదపలేదు.

➡ హుజూరాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, అనంతరం అసెంబ్లీ, పార్లమెంట్, ఇటీవల టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. అయినా ఇతని బదిలీ జరగకపోవడం అతని పలుకుబడికి నిదర్శనం.



బాధ్యతలు స్వీకరిస్తున్న మొండయ్య

➡ ఇవన్నీ తెలిసీ.. కలెక్టర్ కార్యాలయం కూడా ఆయన బదిలీ విషయంలో అలసత్వం వహించి విమర్శలను మూటగట్టుకుంది.

➡ 317 జీవో సమయంలోనూ పలువురు టీచర్లు ప్రొడ్యూస్ చేసిన మెడికల్ సర్టిఫికెట్ల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి.

➡ హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో అప్పటి సీఎం సభను విజయవంతం చేయాలని ఆదేశాలివ్వడం, రూటు బాధ్యతలను టీచర్లకు అప్పగించడం తీవ్ర దుమారం రేపింది.

➡ ఇపుడు కూడా తన స్వయంకృపరాదంతో వేటు పడిందే.. ఆయన్ను ఇక్కడ నుంచి ఎవరూ కదపలేకపోవడం గమనార్హం.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల/రాయికల్: అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్‌లో గిరిజన సంక్షేమ మినీ గురుకులం పాఠశాలలో రూ.40 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, రాజకీయాలతో సంబంధం లేకుండా పని చేస్తున్నానన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకేనన్నారు. బోర్నపల్లి–జగన్నాథపూర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల కేంద్రమంత్రులను కలిశానని గుర్తుచేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు, ఎంపీడీవో చిరంజీవి, ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్, మాజీ సర్పంచ్ రవి, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, అచ్యుత్‌రావు, గన్నె రాజిరెడ్డి, అనుపురం శ్రీనివాస్‌గౌడ్, పడిగెల రవీందర్‌రెడ్డి, తిరుపతిగౌడ్, ముకీద్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి నిరంతర కృషి

జగిత్యాల పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలోని 25, 26 వార్డుల్లో రూ.45లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద వసతులకు రూ.34 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.40 కోట్లు తీసుకొచ్చానన్నారు. మున్సిపాలిటీలో 14 జోన్లు, 126 సర్వే నంబర్లను మార్చామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పవన్, షకీల్, భూమయ్య, నాగేశ్వర్ పాల్గొన్నారు.



ఒడ్డెలింగాపూర్‌లో అదనపు తరగతి గదుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

చికిత్స ద్వారానే క్యాన్సర్ నివారణ

చికిత్స ద్వారానే క్యాన్సర్ నివారణ సాధ్యమని, మూఢనమ్మకాలు నమ్మవద్దని ఎమ్మెల్యే అన్నారు. ఐఎంఏ, కిమ్స్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తే క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గంగాధర్, మధు, శ్రావణ్, సుదీర్, సురేశ్, నవీన్, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి పాల్గొన్నారు.


‘మద్దతు’ ధరపై పెదవి విరుపు

- వరి క్వింటాల్‌కు రూ.69.. మక్కలకు రూ.175
- పెరిగిన ధరలతో జిల్లా రైతులకు రూ.63 కోట్ల లాభం

జగిత్యాలఅగ్రికల్చర్: ఏటా మాదిరిగానే వానాకాలం సీజన్‌కు ముందు పంటల మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ఎక్కువగా సాగయ్యే వరికి క్వింటాల్‌కు రూ.69 మాత్రమే పెంచడంతో పెద్దగా ఉపయోగం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇలా అరకొరగా పెంచడంతో ఒరిగిందేమీ లేదని చెబుతున్నారు. కేంద్రప్రభుత్వం 14 పంటలకు మద్దతు ధరలు ప్రకటించింది. ఇందులో వరి క్వింటాల్‌కు రూ 69, మొక్కజొన్నకు రూ.175 పెంచింది. దీంతో వరి క్వింటాల్ ధర రూ.2.389కు చేరింది. కామన్ రకానికి రూ.2300 ఉండగా.. తాజాగా రూ.2369కు చేరింది. మొక్కజొన్నకు మొన్నటి వరకు రూ.2,225 ఉండగా.. రూ.175 పెరగడంతో రూ.2400కు చేరింది.

జిల్లా రైతులకు రూ.63 కోట్ల లాభం

జిల్లాలో ప్రతి సీజన్‌లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేస్తే 75 లక్షల క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుత ధర రూ.2,320 ప్రకారం రైతులకు రూ.1,740 కోట్లు వస్తే.. పెరిగిన ధర రూ.2,389 ప్రకారం రైతులకు రూ.1791కోట్లు రానున్నాయి. మొక్కజొన్నను దాదాపు 35 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా.. సగటున ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున దిగుబడి అంచనా వేస్తే 7 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుత ధర రూ.2,225 ప్రకారం రైతులకు రూ.156 కోట్లు వస్తే.. పెరిగిన ధర రూ.2400 ప్రకారం రూ.168 కోట్లు రానున్నాయి. ఈ లెక్కన రైతులకు అదనంగా రూ.63 కోట్లు రానున్నాయి. పంటలకు మద్దతు ధర పెరగడంతో ఎక్కువగా దొడ్డురకంతోపాటు మొక్కజొన్నను అధికంగా సాగు చేసే అవకాశం ఉంది.



వరి పంట

క్షేత్ర స్థాయిలో పర్యటించకపోవడంతోనే

పంట సాగు ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాల్సి ఉండగా.. కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా పెంచుతోంది. గతేడాది వరి క్వింటాల్‌కు రూ.143 పెంచగా.. ఈ ఏడాది కేవలం రూ.69మాత్రమే పెంచింది. మద్దతు ధరలను నిర్ణయించే కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక కమిషన్ క్షేత్ర స్థాయిలో పర్యటించి, రైతుల నుంచి సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే కొంత మేలు జరిగేది. గతంలో ఉన్న ధరలకే ఎంతో కొంత శాతం కలిపి ఇస్తుండటంతో సాగు ఖర్చులకు, రైతులకు వచ్చే ఆదాయానికి పొంతన ఉండటం లేదు. ఇవేమీ పట్టించుకోకుండా ధరల నిర్ణాయక కమిషన్ సిద్ధం చేసిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయడంతో రైతులకు అంతంతమాత్రంగానే లాభం చేకూరుతోంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సాగు ఖర్చుకు రెట్టింపు ఆదాయం రావాల్సి ఉండగా.. కనీసం ఖర్చులు కూడా రావడం లేదు.



మొక్కజొన్న

ఏటా రూ.250 పెంచాలి



ఏటా వరికి అదనంగా రూ.250 వరకు పెంచితేనే రైతులకు న్యాయం జరుగుతుంది. రూ.50, రూ.వంద పెంచితే రైతులకు పెద్దగా లాభం ఉండదు. మద్దతు ధర కొంత పెరిగితే కూలీల ఖర్చు రెట్టింపు అవుతోంది.

– గడ్డం సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉత్తమ రైతు, ధర్మపురి

సిఫార్సు మేరకు పెంచాలి



రైతులు పెట్టిన పెట్టుబడికి రెండింతల ఆదాయం రావాలి. అప్పుడే రైతులు నిలదొక్కుకునే అవకాశం ఉంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటల ధరలు పెరగడం లేదు. ర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచాలి.

– వెల్ముల రాంరెడ్డి, వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు, పూడూరు

పశువుల రవాణా నివారణకు చర్యలు



రాజారాంపల్లిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్న ఎస్సై ఉదయ్‌కుమార్

జగిత్యాలక్రైం: పశువుల అక్రమ రవాణాను నిరోధించడానికి జిల్లాలో చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తామన్నారు. పోలీస్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది నిరంతర నిఘాతో పనిచేస్తారని తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా ఆవులు, దూడలను రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో ద్వేషపూరిత, రెచ్చగొట్టేలా, అసభ్యకరమైన పోస్టులు పెట్టొద్దని, అలాంటి వారిపై చర్యల కోసం మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాజారాంపల్లిలో చెక్‌పోస్ట్

వెల్గటూర్: ఎస్పీ ఆదేశాల మేరకు ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో చెక్‌పోస్టును ప్రారంభించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. పశువుల రవాణా నిబంధనల మేరకు జరగాలని, అనుమతి లేకుండా ఆవులు, దూడలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


సిరిపురం శ్రీహరి (ఫైల్)

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌కు చెందిన సిరిపురం శ్రీహరి (47) అప్పుల బాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. శ్రీహరి బీడీ ప్యాకర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబపోషణకు కొంత అప్పు చేశాడు. ఇటీవలే కూతురు పెళ్లి చేశాడు. మొత్తం రూ.8లక్షల వరకు అప్పు ఉందని, దానిని ఎలా తీర్చలోనని నిత్యం మనస్తాపం చెందుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. శ్రీహరి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరారైన ఖైదీ కోసం లుక్ ఆఫ్ నోటీస్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కోర్టు నుంచి మంగళవారం సాయంత్రం పరారైన జున్ను ప్రసాద్ కోసం పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్‌ను పట్టుకునేందుకు పోలీసు శాఖ ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ ఆరు బృందాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడు విదేశాలకు పారిపోకుండా బుధవారం ఉదయమే దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టులకు లుక్ ఆఫ్ నోటీసు జారీ చేశారు.

4.35 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 4.35లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత తెలిపారు. 4.33 లక్షల టన్నుల దొడ్డురకం, 2,475 టన్నుల సన్నరకం కొన్నామని, అకాల వర్షాలు కురుస్తున్నా.. ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించామని పేర్కొన్నారు. ఇంకా 925 టన్నుల ధాన్యం కేంద్రాల్లో ఉందని, యుద్ధప్రతిపాదిక తరలిస్తున్నామని వివరించారు. రైతులకు రూ.1010 కోట్లకు రూ.950.69 కోట్లకు ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేశామని, రూ.893.71 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు.

తిర్మలాపూర్‌లో అత్యధిక వర్షం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం వరకు కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 103.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెగడపల్లిలో 72.8 మి.మీ, కథలాపూర్‌లో 64.8, కొడిమ్యాల మండలం పూడూర్‌లో 62, భీమారం మండలం గోవిందారంలో 56.8, మల్యాల మండలం మద్దుట్లలో 53, మేడిపల్లిలో 48.3, సారంగాపూర్‌లో 44.3, కోరుట్లలో 39, భీమారం మండలం మన్నెగూడెంలో 31.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వానాకాలం రుణ ప్రణాళిక ఖరారు

- ప్రస్తుత సీజన్‌లో రూ.1540 కోట్ల రుణాలు
- గతేడాదితో పోల్చితే రూ.166 కోట్లు అదనం
- జిల్లాలో 24 బ్యాంకుల ద్వారా పంపిణీకి సిద్ధం


భూమి దున్నుతున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ పంటల రుణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. గతేడాదితో పోల్చితే రూ.166 కోట్లు అదనంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. మొత్తంగా ఈ వానాకాలం పంటల సాగుకు రూ.1,540 కోట్లు రుణాలుగా అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించింది. వీటిని జిల్లాలోని 24 బ్యాంకు శాఖల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే బ్యాంకులు 10 శాతం మేర పంట రుణాలు ఇవ్వగా.. మిగిలిన రైతులు పాత రుణాలు చెల్లించి, కొత్తగా రుణం తీసుకుంటున్నారు.

లక్ష్యం రూ 1540 కోట్లు

జిల్లాలో గ్రామీణ, ప్రభుత్వ, ప్రైవేట బ్యాంకులు కలిపి దాదాపు 129 శాఖలు ఉన్నాయి. అన్ని బ్యాంకు శాఖలు పంట రుణాలు ఇచ్చేలా కలెక్టర్ సత్యప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంకుమార్ లక్ష్యాన్ని నిర్దేశించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 1,54,449 మంది రైతులకు రూ.2,564.65 కోట్ల రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సీజన్‌లో 92,671 మంది రైతులకు రూ.1540 కోట్లు, యాసంగిలో 61,778 మంది రైతులకు రూ.102.65కోట్లు రుణాలుగా అందించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

అత్యధికంగా పంట రుణాలను ఇచ్చే బ్యాంకులు

బ్యాంకు	రైతులు	పంట రుణం (కోట్లలో)
కో–ఆపరేటివ్	18,020	299.00
యూనియన్	17,329	288
ఎస్‌బీఐ	15,602	259
తెలంగాణ గ్రామీణ	11,406	189
కెనరా	7,004	116
ఇండియన్	6,539	109

రుణం ఇచ్చేందుకు పేచీలు పెట్టొద్దు



పంట రుణం ఇచ్చేందుకు కొన్ని బ్యాంకులు సర్టిఫికెట్ల పేరిట పేచీ పెడుతున్నాయి. రుణం ఎక్కువ అడిగితే మార్టిగేజ్ చేయమంటున్నారు. కొన్ని బ్యాంకులు పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా తనఖా పెట్టుకుంటున్నాయి. ఎలాంటి నిబంధన లేకుండా రుణాలు ఇవ్వాలి.

– మల్లారెడ్డి, ఎండపల్లి

పంపిణీ ప్రారంభమైంది



అన్ని బ్యాంకుల్లో పంట రుణాల పంపిణీ ప్రారంభమైంది. ఇప్పటికే కొందరు పాత రుణాలు చెల్లించి.. కొత్త రుణం తీసుకుంటున్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు పంట రుణం ఇస్తాం. పట్టాదారు పాస్ బుక్‌లో వ్యవసాయ భూమి ఏ మేరకు ఉంటే, ఆ మేరకు పంట రుణం ఇస్తున్నాం.

– రాంకుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్

వేతనాలు వచ్చేదెప్పుడో..?

- కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఎదురుచూపులు
- నాలుగు నెలలుగా జీతం అందక ఇక్కట్లు
- సర్వీసు పునరుద్ధరణపై నీలినీడలు

గొల్లపల్లి: డీఎస్సీ–2008లో వారంతా అర్హత సాధించారు. పోస్టింగ్ రావడంలో ఆలస్యం కాగా.. 16 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని కాంట్రాక్టు పద్ధతిలోనే విధుల్లోకి తీసుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి అందే వేతనాలు కావడంతో భరోసా ఉంటుందని భావించారు ఆ ఉపాధ్యాయులు. అప్పటివరకు చేస్తున్న ఉద్యోగాలు మానుకుని ఉపాధ్యాయులుగా చేరారు. వారికి నాలుగు నెలలైనా వేతనం రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 38 మంది

జిల్లాలో డీఎస్సీ – 2008 అభ్యర్థులు 38 మంది ఈ ఏడాది ఫిబ్రవరి 15న విధుల్లో చేరారు. వారిని వివిధ పాఠశాలలకు కేటాయించగా పాఠాలు బోధిస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు మాత్రం పొందడం లేదు. విద్యా సంవత్సరం చివరలో ఆయా ఉపాధ్యాయులను టెర్మినేట్ చేసిన విద్యాశాఖ.. వేతనాల జారీలో మాత్రం జాప్యం చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

పెండింగ్‌లో ఉన్నాయి

2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయుల వేతనాల అంశం రాష్ట్రస్థాయిలో ఉంది. జిల్లాలో 38 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికి నాలుగు నెలలకు సంబంధించిన వేతనాలు ఇవ్వాల్సిన మాట వాస్తవమే. వేతనాలు, సర్వీసు పునరుద్ధరణపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రాము, డీఈఓ

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



ఎంతో ఆశతో ఉద్యోగాలు చేస్తూ వచ్చాం. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టమవుతోంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఇటీవలే జరిగిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు ఐదు రోజులు పాల్గొన్నాం.

– శివకుమార్, ఎంపీపీఎస్, భీమారం

వేతనాలు ఇవ్వాలి



కస్తూరిబా పాఠశాలలో సీఆర్టీ ఉద్యోగం మానేసి పాఠశాలలో చేరాను. ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదు. ఏప్రిల్ 23న టెర్మినేట్ చేశారు. మిగితా కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులను మూడు రోజుల్లో విధుల్లోకి తీసుకున్నారు. ప్రభుత్వం మా ఆవేదనను అర్థం చేసుకుని వేతనాలు చెల్లించాలి.

– జయ, పీఎస్, తొత్తునూర్

సహకార సంఘాల్లో బదిలీలు

- కసరత్తు చేస్తున్న అధికారులు
- జిల్లాలో 51 పీఏసీఎస్‌లు.. 148 మంది ఉద్యోగులు


భూషణరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

కథలాపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న అధికారులకు బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. వీరంతా ఏళ్ల తరబడిగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు బదిలీ చేపట్టాలని ప్రభుత్వం ఇటీవలే జీవో జారీ చేసింది. ఇందుకోసం ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 51 సహకార సంఘాలు.. 148 మంది ఉద్యోగులు

జిల్లాలో 20 మండలాల పరిధిలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో సీఈవోలు 42 మంది, స్టాఫ్ అసిస్టెంట్లు 106 మంది పనిచేస్తున్నారు. ఇతర సిబ్బంది తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. సీఈవోలతోపాటు స్టాఫ్ అసిస్టెంట్లను బదిలీ చేయనున్నారు. ఏళ్లతరబడి ఒకేచోట పనిచేస్తుండడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ డీసీసీబీ పరిధిగా బదిలీలు

కొత్త జిల్లాల వారీగా డీసీసీబీలు లేకపోవడంతో ఉమ్మడి కరీంనగర్ డీసీసీబీ పరిధిగానే బదిలీలు చేపడుతారని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కమిటీని నియమించారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డీసీవో, నాబార్డు డీడీఎం, డీసీసీబీ జీఎం, డీజీఎంలు కన్వీనర్లుగా ఉంటారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న అధికారుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఏళ్లతరబడి ఉద్యోగుల బదిలీలు జరగలేదు. ఉమ్మడి కరీంనగర్ డీసీసీబీ పరిధిలో ఉద్యోగుల బదిలీలు నిర్వహిస్తాం.

– మనోజ్‌కుమార్, డీసీవో

కోర్టు ఆవరణలో ఆటో దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



పట్టుకున్న ఆటోతో నిందితుడు, పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కోర్టు ఆవరణలో పార్కింగ్ చేసిన ఆటోను దొంగిలించిన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన జిలకర ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం బుట్టపూర్‌కు చెందిన మగ్గిడి కృష్ణ ఈనెల 26న జగిత్యాల కోర్టు ఆవరణలో ఆటోను పార్కింగ్ చేశాడు. దానిని ప్రసాద్ చాకచక్యంగా దొంగిలించాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో ఈనెల 27న పట్టణ ఎస్సై గీత జిల్లాకేంద్రంలోని గాంధీనగర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ప్రసాద్ ఆటోలో వస్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడిన ఉంచి ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై గీత, కానిస్టేబుళ్లు జీవన్, అనిల్, వంశీ పాల్గొన్నారు.

దళిత యువకుడిని చితకబాదిన పోలీసులు

- దెబ్బతిన్న బాధితుడి చెవి కర్ణభేరి
- హెచ్ఆర్‌సీ, నేషనల్ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు
- విచారించి నివేదిక ఇవ్వాలని అడిషనల్ డీజీపీ, సీపీకి నోటీసులు


దెబ్బతిన్న మహేందర్ చెవి కర్ణభేరి


మహేందర్

సైదాపూర్: డ్రంకెన్‌డ్రైవ్‌లో సహకరించడం లేదని ఓ దళిత యువకుడిని 20 రోజుల క్రితం చితకబాదిన ఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో చోటుచేసుకుంది. జరిగిన ఘటనపై దళిత సంఘాలు వివిధ రూపాల్లో బాధితుడికి న్యాయం చేయాలని ఆందోళనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. బాధితుడు కరీంనగర్ సీపీ, మానవ హక్కుల కమిషన్, నేషనల్ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషన్ కోరినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. సైదాపూర్‌లో ట్రైనీ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న అగస్త్య భార్గవ్‌గౌడ్ తోటి సిబ్బందితో కలిసి మండలంలోని లస్మన్నపల్లి శివారులో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గొల్లగూడెం గ్రామానికి చెందిన బత్తుల మహేందర్ మొలంగూర్ నుంచి సైదాపూర్ వస్తున్నాడు. పోలీసులు ఆపారు. టెస్టు చేసి చలాను వేసిన తర్వాత అతడి వివరాలు రాసుకున్నారు. ఇంతలో మహేందర్‌కు ఇంటి వద్ద నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ మాట్లాడుతున్న బాధితున్ని సహకరించడం లేదని ఫోన్ తీసుకొని ఎస్ఐ అగస్త్య భార్గవ్‌గౌడ్‌తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడే చితకబాదారు. చెవి కర్ణభేరి దెబ్బతిని చెవి నుంచి రక్తం కారుతున్నా వదల్లేదని, తర్వాత పోలీస్ స్టేషన్‌కు పిలిచి తనతో క్షమాపణ పత్రం రాయించుకున్నారని మహేందర్ కమిషన్లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై విచారించాలని కరీంనగర్ సీపీ హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. బాధితుడి వాగ్మూలం తీసుకున్న మర్నాడే ఏసీపీ శ్రీనివాస్ బదిలీ కావడంతో పోలీసుల విచారణలో జాప్యం జరుగుతోందని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. హెచ్ఆర్‌సీ, నేషనల్ ఎస్సీ కమిషన్ మాత్రం అడిషనల్ డీజీపీ, కరీంనగర్ సీపీకి విచారణ నివేదికను 20 రోజుల్లో అందజేయాలని నోటీసులు జారీ చేసింది. తాను పీజీ బీఈడీ చేసి, నిరుద్యోగిగా కూల్‌డ్రింకులు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, అకారణంగా చితకబాదడంతో అవమానంతో మానసికంగా భరించలేకపోతున్నాని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మహేందర్ అప్పటికే వేరే సంఘటనలో ఇతరులతో తగాదా పడి దెబ్బలు తిని వస్తున్నాడని, డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులో సహకరించకుండా పోలీసులతో దుర్భాషలాడారని, అందుకు క్షమాపణ పత్రం రాసి ఇచ్చాడని పోలీసులు పేర్కొంటున్నారు. వాస్తవాలు ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

కేబుళ్లతో వినియోగదారులకు ముప్పు వాటిల్లొద్దు

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలియనాయక్


కేబుల్ ఆపరేటర్లతో మాట్లాడుతున్న సాలియనాయక్

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ స్తంభాలకు కేబుల్ ఆపరేటర్లు వైర్లను కడుతుండటంతో వినియోగదారుల భద్రతకు ముప్పు పొంచి ఉందని ఎస్ఈ సాలియానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం కేబుల్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. టీవీ కేబుల్, ఇంటర్నెట్ సేవలందించే ఆపరేటర్లు స్తంభాలకు ఇష్టారీతిన వైర్లు బిగిస్తున్నారని పేర్కొన్నారు. అద్దె చెల్లించాలని, క్రమబద్ధీకరణ తప్పనిసరి చేయాలని, కేబుళ్ల నిర్వహణ ఎప్పటికప్పుడు చూసుకోవాలని సూచించారు. కేబుళ్ల అన్నింటిని బంచ్ చేసి క్లాంప్స్ అమర్చాలన్నారు. డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించి అన్నివిధాలా ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య కోరారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ఉద్యమకారులతో కలిసి నివాళి అర్పించారు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత తమకు ప్రాధాన్యత దక్కుతుందని ఆశపడితే అప్పటి సీఎం ఉద్యమకారులను విస్మరించారని విమర్శించారు. కేవలం తమ కుటుంబానికే ప్రాధాన్యత ఇచ్చుకున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు మేలు కలిగేలా చూడాలని కోరారు. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సారయ్య, నల్ల మనోహర్‌రెడ్డి, రాజేశం, జ్యోతి, చంద్రకళ, సురేందర్‌రెడ్డి, భాస్కర్, సదాశివ, రాజిరెడ్డి, రాజు, కృష్ణ, సదయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వం లక్ష్యం


లబ్ధిదారులకు మంజూరుపత్రం అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి లబ్ధిదారులకు అందించారు. భీమారం, మేడిపల్లి మండల వ్యాప్తంగా 397 మందికి పత్రాలు అందించారు. విప్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గ పరిధిలో 3,500మందికి ఇల్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

- రెండు కిడ్నీలు పనిచేయక యువకుడి నరకయాతన


అనారోగ్యంతో బాధపడుతున్న దుబ్బాక కుమార్


దాతాలు ఆదుకోవాలని కుమార్ కుటుంబ సభ్యుల వేడుకోలు


రామగిరి(మంథని): భర్త అనారోగ్యం.. ఆర్థికలేమి.. ముగ్గురు పిల్లలు పోషణ.. కూలీ పనులతో కుటుంబాన్ని నెట్టుకు రావడం ఆ గృహిణికి తలకుమించిన భారంగా మారింది. దాతలు సాయం చేస్తే భర్తకు మంచి వైద్యచికిత్స అందిస్తామని, పిల్లల పోషణ చూసుకుంటానని అంటోంది ఆ గృహిణి. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన దుబ్బాక కుమార్ – విజయ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం కిరణ్, మహేందర్, చెర్రీ ఉన్నారు. అనారోగ్యానికి గురైన కుమార్.. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. అయినా నయం కాలేదు. తనకున్న స్థోమత వరకు ఖర్చు చేశాడు. చేతిలో ఉన్న సొమ్మంతా ఖర్చు కావడంతో మళ్లీ ఆస్పత్రికి వెళ్లడానికి చిల్లిగవ్వకూడా లేకుండాపోయింది. కనీసం ప్రయాణానికి కూడా డబ్బులు లేని దీనస్థితిలో ఆ కుటుంబం ఉంది. విజయ కూలీ పనులకు వెళ్లి అంతోఇంతో సంపాదిస్తున్నా కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదు. దాతలు ముందుకు వచ్చి తన భర్తను కాపాడాలని విజయ కోరుతోంది.

ఫాజుల్‌నగర్ ప్రాంతంలో 'పులి' ఆనవాళ్లు

వేములవాడరూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ ప్రాంతంలో పులి తిరుగుతున్నట్లు ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈవిషయంపై వేములవాడ ఎఫ్ఆర్‌వో కలీలొద్దీన్‌ను వివరణ కోరగా వేములవాడ, కొడిమ్యాల, చందుర్తి ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజుకు పులి 35 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, అది ఫారెస్టు ప్రాంతంలో అనుకూలమైన ప్రాంతానికి వెళ్తుందని తెలిపారు.

రైతుల కష్టం వరదపాలు


- తడిసి మొలకెత్తిన ధాన్యం


రాచర్లతిమ్మాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో తడిసి మొలకెత్తిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అధికారుల నిర్లక్ష్యం మూలంగా వరదపాలైంది. అకాల వర్షాలు దండికొట్టడంతో 45రోజులుగా తూకం వేయకుండా కేంద్రాల్లోనే ఉన్న ధాన్యం వర్షానికి తడిసి మొలకెత్తింది. దీంతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. ఐకేపీ అధికారులు, నిర్వహకుల నిర్లక్ష్యం వల్ల మాయిచ్చర్ వచ్చి 45 అయినప్పటికీ రైతులు కేంద్రాలకు తెచ్చిన వడ్లను తూకం వేయలేదు. కేంద్రాల్లో హమాలీలు లేక, నిర్వహకులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

హ్యాకర్ల చేతికి ఓదెల ఆధార్ కేంద్రం

- అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందిచొద్దు
- యూఐడీఏఐ కార్యాలయ అధికారుల ఆదేశం



ఆధార్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామంటూ వచ్చిన కాల్

పెద్దపల్లిరూరల్: ఆన్‌మోసాలు ఆగడంలేదు. సైబర్ నేరగాళ్లు, ఆన్‌లైన్ మోసగాళ్లు రోజుకో రూట్ మార్చుతూ ప్రజలకు ఎరవేస్తున్నారు. తాజాగా ఓదెల మండల కేంద్రంలోని మీసేవ ఆపరేటర్ తన ఆధార్ కేంద్రానికి సంబంధించి అప్‌డేట్ చేస్తామంటూ సైబర్ మోసగాళ్లు (సెల్ నంబరు 07427069687) నుంచి చేసిన ఫోన్‌కాల్‌కు స్పందించడంతో ఆధార్ సెంటర్‌ను హ్యాక్ చేశారు. కొద్ది నిమిషాల్లోనే ఆ ఐడీ ద్వారా నాలుగు ఆధార్‌కార్డులు డౌన్‌లోడ్ చేసినట్లు ఆపరేటర్‌కు సమాచారం రావడంతో అవాక్కయ్యాడు. ఆ వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. స్పందించిన అధికారులు యూఐడీఏఐ అధికారులను అప్రమత్తం చేశారు. వారు ఆధార్‌సెంటర్ హ్యాకర్ల చేతికి చిక్కినట్లు నిర్ధారించారు. ఇలాంటి ఘటన ఇదివరకు నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ జరిగినట్లు సమాచారం. జిల్లాలోని పలు ఆధార్‌కేంద్రాల నిర్వాహకులకు సైతం ఇలాంటి ఫోన్‌కాల్స్ వచ్చినట్లు ఆపరేటర్లు తెలిపారు. కొంతకాలంగా ఓదెల మీసేవ కేంద్రంలో గల ఆధార్ సెంటర్ ద్వారా సేవలు నిలిపి వేశారు. కొద్ది రోజుల క్రితమే అధికారులు అనుమతినివ్వడంతో సేవలు పునరుద్ధరించారు. ఈ క్రమంలో హ్యాకర్ల నుంచి ఫోన్‌కాల్ రావడంతో ఆధార్ కేంద్రం అనుమతులిచ్చే కార్యాలయ అధికారుల నుంచే ఫోన్‌కాల్ వచ్చిందని భావించి ఎనీడెస్క్‌ను హ్యాకర్లకు అప్పగించి మోసపోయినట్లు తెలిసింది.

పీఈసీ కిట్లను అప్పగించొద్దు..

ఆధార్ కేంద్రాలను నిర్వహించే ఆపరేటర్లు అనధికారిక అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని యూఐడీఏఐ అధికారులు బుధవారం రాష్ట్రంలోని ఆధార్ ఆపరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ఆధార్‌కేంద్ర నిర్వాహకులు తమ సెంటర్లలో వినియోగించే కంప్యూటర్ నుంచి ఎనీడెస్క్, లేదా ఇతర రిమోట్‌యాక్సెస్ ఇచ్చి మోసపోతున్నారని, ఇది ఆధార్ డేటా భద్రతకు ముప్పు తెస్తుందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎనీడెస్క్, టీంవ్యూయర్ ఇతర రిమోట్ యాక్సెస్ సమాచారాన్ని అనధికార వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. యూఐడీఏఐ భద్రతా విధానాలకు అనుగుణంగా అవసరం లేని రిమోట్ యాక్సెస్ టూల్స్‌ని అన్‌ఇన్‌స్టాల్ చేయాలన్నారు.

చెక్‌డ్యాంలు కళకళ





జగిత్యాలఅగ్రికల్చర్: ఇటీవలి భారీ వర్షాలకు కొడిమ్యాల మండలంలోని ఐదు చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. మొన్నటివరకు చెక్‌డ్యాంలు ఎండిపోవడంతో.. పక్కనున్న చెరువుల నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించి పంటలను కాపాడుకున్నారు. ప్రస్తుతం చెక్‌డ్యాంలు వరద నీరుతో కళకళలాడుతున్నాయి.